

ఎరుకుమాంబకు జలాభిషేకం

విశాఖ: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు.



వరదపాయస ఉత్సవం 8లో

వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ప్రార్థిస్తూ సింహగిరి వైకుంఠవాసుడి మెట్టపై బుధవారం వరదపాయసం సేవను ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.8/23.5

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

గంజాయి అక్రమ రవాణా అరికట్టాలి



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

అనకాపల్లి : ఆంధ్ర, ఒడిశా బోర్డర్, ఏజెన్సీ ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. తమ కార్యాలయంలో బుధవారం గంజాయి అక్రమ రవాణాపై సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి కేసుల్లో దర్యాప్తు అధికారులు కేసులపై ప్రత్యేక దృష్టి సాధించి, నేరాభియోగ పత్రాలను సంబంధిత కోర్టులో సమర్పించాలని ఆయన కోరారు. గంజాయి అక్రమ రవాణా ఇతర డ్రగ్స్ నివారణకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, కె.వి.సత్యనారాయణ, జి.ఆర్.ఆర్.మోహన్, సీఐలు లక్ష్మణ్ మూర్తి, గణేష్, కుమారస్వామి, ఎస్ఐలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వని దుకాణ యజమానులపై కేసులు

చోడవరం : కార్మిక చట్టం ప్రకారం కూలీలకు వేతనాలు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని చోడవరం సహాయ కార్మిక శాఖాధికారి పి. సూర్యనారాయణ హెచ్చరించారు. కార్మిక చట్టం ప్రకారం వేతనం ఇవ్వని ఇద్దరు యజమానుల నుంచి వసూలు చేసిన రూ. 24,960 బుధవారం ఇద్దరు కార్మికులకు అందజేశారు. పాడేరు, దేవరాపల్లి గ్రామాల్లో రెండు షాపుల్లో ఇద్దరు కార్మికులకు కార్మిక చట్టం ప్రకారం వేతనం ఇవ్వలేదని తమ పరిశీలనలో తేలిందని, దీనిపై యజమానులపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. దీనిలో భాగంగా సదరు యజమానుల నుంచి కార్మికులకు రావలసిన వ్యత్యాస జీతాన్ని రూ. 24,960ని వసూలు చేసి కార్మికులకు అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సహాయక లేబర్ ఆఫీసర్ వసంతరావు పాల్గొన్నారు.

ఏయూ పరిధిలో పరీక్షలు వాయిదా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన పలు డిగ్రీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ విద్యార్థి సంఘాలు ఈ నెల 4న బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో డిగ్రీ రెండవ, నాల్గో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. బి.ఎ., బి.ఎస్సీ, బి.కాం, బీసీఏ, బీబీఏ, బీహెచ్ఎంఅండ్‌సీటీ కోర్సుల పరీక్షలు వాయిదా వేశామని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

ఇగ్నోలో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ (విశాఖ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024 జూలై ప్రవేశాల గడువును పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. httpr://-ignouadmission.samarth.edu. in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు జూలై 15 తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మహిళా ఉద్యోగులకు ప్రత్యేక వసతులు



రెస్ట్‌రూం, క్రెచ్‌లను ప్రారంభిస్తున్న ఈకార్వో అధ్యక్షురాలు కవితా ఫంక్వాల్

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్‌కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ కవితా ఫంక్వా ల్ వాల్తేర్ డివిజన్ పరిధిలో మొదటిసారిగా బుధవారం పర్యటించారు. ఇందులో భాగంగా డీజిల్ లోకోషెడ్‌లో మహిళా ఉద్యోగినుల కోసం ఆధునికీకరించిన విశ్రాంతి గది, బేబీ క్రెచ్‌లను ఆమె ప్రారంభించారు. వాల్తేర్ డివిజన్ ఈకార్వో ప్రెసిడెంట్, ప్రతినిధుల సహాయంతో ఈ సౌకర్యాలను కల్పించారు. సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్(డీజిల్) ఆర్ఆర్ మిశ్రా, ఈకార్వో వాల్తేర్ డివిజన్ ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, డీజిల్ లోకోషెడ్ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

అగ్గి పిడుగు అల్లూరి



నేడు అల్లూరి జయంతి

- కృష్ణదేవిపేట పార్కులో జయంతి సభకు భారీ ఏర్పాట్లు
- హాజరు కానున్న స్పీకర్ అయ్యన్న

అతడే ఒక సైన్యం. అనితర సాధ్యం అతని సాహసం. తెల్లదొరల గుండెల్లో వణుకు పుట్టించిన యోధుడు. గిరిజనుల్లో విప్లవాగ్ని రగిలించి, బ్రిటిష్ పాలనపై యుద్ధం ప్రకటించిన అసమాన వీరుడు. వలసపాలన నుంచి దేశమాతను రక్షించేందుకు ప్రాణాలనే పణంగా పెట్టిన ధీరోదాత్తుడు. అందుకే ఈనాటికీ ఆ మహనీయుడు చిరస్మరణీయుడిగా నిలిచాడు. స్ఫూర్తి రగిలిస్తూనే ఉన్నాడు.

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127 జయంతి వేడుకలు గొలుగొండ మండలంలోని కృష్ణదేవిపేట (ఏఎల్‌పురం)లో గురువారం నిర్వహించనున్నారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడితో పాటు పలువురు ప్రముఖులు హాజరై అల్లూరికి నివాళులర్పించనున్నారు. నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్కు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, వెలుగు, అంగన్‌వాడీ సిబ్బందితో ముగ్గులు వేయించారు. గురువారం కృష్ణదేవిపేట గ్రామం నుంచి పార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించి మన్యం వీరుడికి ఘన నివాళులు అర్పించనున్నారు. బ్రిటిష్ పాలకుల కబంధ హస్తాల నుంచి అమాయక గిరిజన ప్రజల విముక్తి కోసం అల్లూరి చేసిన పోరాటం ఈ ప్రాంతంలో మరువలేనిది. గెరిల్లా యుద్ధం చేసి తెల్లదొరలను గడగడలాడించిన అల్లూరిని కొయ్యూరు మండలంలో హతమార్చి ఆయన మృతదేహానికి కృష్ణదేవిపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. గురువారం నాటి కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర క్షత్రియ సంఘం సభ్యులతోపాటు జాతీయ అల్లూరి యువజన సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు కూడా పాల్గొంటున్నారు. ఏర్పాట్లపై ఆర్డీవో జయరాం బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు.



పార్కులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం



ముగ్గులు వేస్తున్న అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది

రామరాజు బస చేసిన గ్రామమిది..



దద్దుగుల గ్రామం

నాతవరం: అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు నాతవరం మండలంలోని దద్దుగుల గిరిజన గ్రామంలో కూడా పర్యటించారు. ఇక్కడి ప్రజల ఆతిథ్యం స్వీకరించి, రాత్రి బస చేశారు. అందుకు గుర్తుగా ఇక్కడ అల్లూరి జయంతి, వర్ధంతి వేడుకలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. 1922లో సరుగుడు పంచాయతీ శివారు దద్దుగుల గ్రామానికి అల్లూరి వచ్చారు. అప్పుడు ఈ ప్రాంతం కొయ్యూరు సమితి పరిధిలో ఉండేది. పితూరి కాలంలో సీతారామరాజు కృష్ణదేవిపేట నుంచి తూర్పుగోదావరి జిల్లా పెదమల్లాపురానికి దద్దుగుల గ్రామం మీదుగా వెళ్లేవారు. ఆయన గ్రామానికి వచ్చేసరికి చీకటి కావడంతో అప్పటి గ్రామపెద్ద గొల్లపల్లి ఊబయ్య ఆతిథ్యం ఇచ్చారు. అల్లూరి సీతారామరాజుతో పాటు ఆయన అనుచర బృందానికి మంచి విందు ఏర్పాటు చేశారు. ఆ గ్రామంలో సీతారామరాజు గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేసి బ్రిటిష్ ప్రభుత్వం మన సంపదను ఏవిధంగా దోచుకుంటున్నదో వివరించారు. అల్లూరి ప్రసంగం విన్న గొల్లపల్లి కుటుంబీకులతోపాటు పలువురు గ్రామస్తులు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నట్టు పెద్దలు చెప్పారు.

నేడు దద్దుగులలో స్మారక సభ

అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా దద్దుగుల గ్రామంలో గిరిజన సమన్వయ కమిటీ, గిరిమిత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి స్మారక సభ ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అల్లూరి నడయాడిన ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని గిరిమిత్ర స్వచ్ఛంద సేవా సంఘం ప్రతినిధి బండి గంగరాజు కోరారు. గురువారం జరిగే సభలో ఈ ప్రాంత గిరిజనులమంతా ఈమేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేసి కలెక్టరుకు నివేదిస్తామన్నారు.

గిరి ప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు

- ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు
- ప్రశాంత వాతావరణంలో గిరి ప్రదక్షిణకు భారీ బందోబస్తు

విశాఖ సిటీ: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ పోలీస్ అధికారులను ఆదేశించారు. గిరి ప్రదక్షిణ ఈ నెల 20, 21 తేదీల్లో జరగనున్న దృష్ట్యా చేపట్టాల్సిన బందోబస్తుపై బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో సీపీ పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గతంలో జరిగిన పలు గిరి ప్రదక్షిణ బందోబస్తు ఏర్పాట్లను వీడియోల ద్వారా పరిశీలించారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులతో పాటు నగర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఎక్కడా ట్రాఫిక్ స్తంభించకుండా ముందస్తు చర్యలపై చర్చించి పలు ఆదేశాలు జారీ చేశారు. గిరి ప్రదక్షిణలో భాగంగా సముద్ర స్నానాలు చేసే భక్తులను అప్రమత్తం చేసే ఏర్పాట్లపైన, ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

ప్రదక్షిణ ముగించుకొని దర్శనానికి వెళ్లే భక్తులకు క్యూలైన్లు వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడ బారికేడ్ల ఏర్పాటు చేయాలన్నారు. గిరి ప్రదక్షిణ చేసే మార్గాలన్నీ పూర్తి లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

గ్రామీణ తపాల ఉద్యోగులకు టార్గెట్లు తగవు

తుమ్మపాల : గ్రామీణ తపాలా ఉద్యోగులపై విధిస్తున్న టార్గెట్లు నిలిపివేయాలని కోరుతూ పట్టణంలో పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ముందు తపాల ఉద్యోగులు ధర్నా చేసి వినతి పత్రాన్ని పోస్టల్ అసిస్టెంట్ సూపరిండెంట్ సంజయ్ పాండాకు అందజేశారు. ఆల్ ఇండియా డాక్ సేవక్ యూనియన్ (ఏఐటీయుసీ అనుబంధం) ఆధ్వర్యంలో కేంద్ర యూనియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా నిర్వహించిన ధర్నాలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.దుర్గాప్రకాష్ మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో సంస్థకు అత్యధిక సంపద సృష్టించే గ్రామీణ ఉద్యోగుల మీద ప్రతిరోజు టార్గెట్లు విధిస్తూ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న డిపార్టుమెంట్ అధికారుల వైఖరి నిలిపివేయాలని, వీరి కారణంగానే గ్రామీణ తపాల కార్మికులు రోగాల బారిన పడి మరణించడం జరుగుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. రోజుకు నాలుగు గంటలకు బదులు 8 గంటల పని, టార్గెట్‌లతో వేధింపులు మానుకోకుంటే జీడీఎస్‌లతో పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు వై.ఎన్ భద్రం, డివిజన్ అధ్యక్షుడు ఎస్.సతీష్ కుమార్, కోశాధికారి పి.నూకరాజుదొర, ఎం.నాగేశ్వరి, కె.మధు, గంగరాజు పాల్గొన్నారు.



పట్టణ పోస్టల్ బ్రాంచి దగ్గర ధర్నా చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

సోదరులే కాలయములు



మృతదేహాన్ని పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్) సతీష్‌కుమార్ మృతదేహం, ఫైల్ ఫొటో



నిందితులు సున్నం మనోజ్ కుమార్, రాజేష్

- ఆస్తి కోసం అన్నను హత్య చేసిన తమ్ముళ్లు
- దార్లపూడి సమీపంలో మృతదేహం పూడ్చివేత
- మృతుడి చిన్నాన్నలకు అనుమానం రావడంతో కదిలిన డొంక

యలమంచిలి రూరల్: కన్న ప్రేమ కంటే పెంచుకున్న ప్రేమ గొప్పదంటారు. తన కుమారుడికి కష్టసుఖాల్లో తోడుగా ఉంటాడని మరదలు కొడుకుని యలమంచిలికి చెందిన స్వర్ణకారుడు సున్నం బ్రహ్మాజీ దత్తత తీసుకున్నారు. బాగా స్థితిమంతుడైన బ్రహ్మాజీ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఆస్తిపై కన్నేసిన దత్తపుత్రుడు బ్రహ్మాజీ సొంత కుమారుడిని అతి కిరాతకంగా హత్య చేసి పెంచిన ప్రేమకే కళంకం తెచ్చాడు. తన సోదరుడి సాయంతో ఈ దారుణానికి ఒడిగట్టాడు. యలమంచిలి సీఐ షేక్ గఫూర్, హతుడి బంధువులు అందించిన వివరాల ప్రకారం యలమంచిలి తులసీనగర్‌కి చెందిన నగల వ్యాపారి సున్నం బ్రహ్మాజీకి శ్రీ క్రాంతి జ్యూయలర్స్ పేరుతో నగల దుకాణం ఉంది. ఇటీవల బ్రహ్మాజీ అనారోగ్యంతో మృతి చెందారు. కన్న కొడుకు సున్నం సతీష్‌కుమార్ (38) గతంలో ప్రేమ వివాహం చేసుకోవడంతో అతడిని కొంత కాలం బ్రహ్మాజీ దూరం పెట్టారు. భార్యతో వివాదాల కారణంగా విడాకులు తీసుకోవడంతో కుమారుడిని మళ్లీ ఇంటికి రానిచ్చారు. ఇదిలా ఉండగా గతంలో తన మరదలి కుమారుడు సాయి మనోజ్‌కుమార్‌ను బ్రహ్మాజీ దత్తత తీసుకున్నారు. బ్రహ్మాజీ మృతితో కొంతకాలంగా ఆస్తుల గురించి సతీష్ కుమార్, మనోజ్‌కుమార్ మధ్య వివాదం నలుగుతోంది. పెద్ద మనుషుల మధ్య పంచాయతీ కూడా జరిగింది. ఆస్తులపై ఇద్దరికీ సమాన హక్కులు ఉంటాయని పెద్దలంతా తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో సతీష్‌కుమార్ అడ్డు తొలగించుకుంటే ఆస్తి మొత్తం కాజేయవచ్చన్న దురాశతో అతడ్ని హత్య చేసేందుకు సోదరుడు రాజేష్‌తో కలిసి పథకం రచించాడు మనోజ్‌కుమార్.

మృతదేహం మాయం

గత నెల 27 గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో ఇంట్లో మద్యం మత్తులో ఉన్న సతీష్‌కుమార్ ఛాతీ, ముక్కు, ముఖ భాగాలపై పిడి గుద్దులు గుద్ది నిందితులు హతమార్చారు. మృతదేహాన్ని ఎస్.రాయవరం మండలం దార్లపూడి సమీపంలో పోలవరం ఎడమ ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన కింద పూడ్చిపెట్టారు. ఆ మరుసటి రోజు నుంచి నిందితులిద్దరూ దర్జాగా తిరుగుతున్నారు. వారి కదలికలు, ప్రవర్తనపై అనుమానం రావడంతో సతీష్‌కుమార్ చిన్నాన్నలు సున్నం శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పట్టణ పోలీసుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. మంగళవారం సతీష్‌కుమార్ తల్లి నాగమణి తన కుమారుడు కనిపించడంలేదని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించి నిందితులిద్దర్నీ అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించడంతో సోదరుడ్ని తామే హత్య చేసినట్టు అంగీకరించారు. వారిచ్చిన సమాచారంతో పూడ్చిపెట్టిన ప్రదేశానికి వెళ్లిన పోలీసులు రెవెన్యూ అధికారుల సమక్షంలో సతీష్‌కుమార్ మృతదేహాన్ని తవ్వి బయటకు తీయించారు. శవపంచనామా, పోస్టుమార్టం పూర్తి చేయించి కుటుంబీకులకు అప్పగించారు. ఈ దారుణ హత్యలో మరికొందరి ప్రమేయం ఉందని, వారిని కూడా అరెస్ట్ చేయాలని హత్యకు గురైన సతీష్‌కుమార్ చిన్నాన్నలు పోలీసులను కోరారు.

అని కోణాల్లో దర్యాప్తు: సీఐ గఫూర్

ఈ హత్యకు సంబంధించి అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలు, మొబైల్ ఫోన్ కాల్స్ డేటా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని యలమంచిలి సీఐ మీడియాకు తెలిపారు. ఇంకా నిందితులెవరైనా ఉంటే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

‘అతిసార’పై అప్రమత్తం

- జిల్లాలో ప్రబలకుండా ముందస్తు చర్యలు
- ప్రారంభమైన స్టాప్ డయేరియా కార్యక్రమం
- ఈ నెల 1 నుంచి వచ్చే నెల 31 వరకూ ప్రత్యేక డ్రైవ్
- 1.07 లక్షల మంది చిన్నారులకు మేలు
- శిశు మరణాల నియంత్రణే లక్ష్యం
- రెండు నెలల్లో మూడు దశల్లో కార్యక్రమం



తుమ్మపాలలో డెంగ్యూపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది



సాక్షి, అనకాపల్లి : బాల్యం అతిసార బారిన పడి మృత్యువు అంచులకు చేరువవుతోంది. ముందస్తు జాగ్రత్తలతో అతిసార వ్యాధి నుంచి బయటపడే అవకాశం ఉంది. కాదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాంతకం కానుంది. ఈ వ్యాధితో ప్రతి ఏటా బాలల్లో 5.8 శాతం మరణాలు అతిసార వల్లనే సంభవిస్తున్నాయని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. జిల్లాల స్థాయిలోనూ ఈ ప్రమాదం పొంచి ఉందని జాతీయ ఆరోగ్య నివేదికలు రాష్ట్రాలను అప్రమత్తం చేశాయి.

అతిసార వ్యాధి పట్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. బాలల్లో అతిసార మరణాలను పూర్తిగా నివారించేందుకు స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రారంభించింది. ఏజెన్సీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న సరిహద్దు ప్రాంతాలైన నర్సీపట్నం నియోజకవర్గంలో గొలుగొండ, నాతవరం, మాడుగుల నియోజకవర్గంలో చీడికాడ, దేవరాపల్లి, చోడవరం నియోజకవర్గంలో బుచ్చియ్యపేట మండల పరిధిలో గల గ్రామాల్లో అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలుండడంతో ప్రత్యేక దృష్టి సారించింది.

గత రెండేళ్లలో సింగిల్ డిజిటే..

జిల్లాలో గత రెండేళ్లలో అతిసార కేసులు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. గత రెండేళ్లలో ఫ్యామిలి డాక్టర్, ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాల పేరిట నేరుగా గ్రామాల్లోనే హెల్త్ డ్రైవ్‌లు నిర్వహించడం, పాఠశాలల్లో ముందస్తుగా విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్త్ చెకప్‌లు నిర్వహించడంతో అతిసార వ్యాధిని పూర్తిస్థాయిలో నియంత్రించడం జరిగింది

ఐడీసీఎఫ్... ఐడీసీపీగా మార్పు

జాతీయ ఆరోగ్య సంస్థ పర్యవేక్షణలో ప్రతి ఏటా 15 రోజుల పాటు ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్(ఐడీసీఎఫ్) నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ప్రోగ్రాం (ఐడీసీపీ)గా మార్చారు. దీనినే స్టాప్ డయేరియా క్యాంపెయిన్–2024గా పిలుస్తున్నారు. పెరుగుతున్న కేసులు, ప్రభావితమవుతున్న బాలల భద్రత కోసం ఏటా రెండు నెలల పాటు ఏడు శాఖల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మహిళ, శిశు సంక్షేమ శాఖ, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ విభాగం, పట్టణాభివృద్ధి. పంచాయతీరాజ్ శాఖలు, విద్యాశాఖ, ఆహార భద్రతా విభాగాలు సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తాయి.

మూడు దశల్లో ప్రత్యేక డ్రైవ్

స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమాన్ని మూడు దశల్లో ఈ నెల 1 నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకూ రెండు నెలల పాటు నిర్వహిస్తున్నారు. ఈ నెల 1- 14వ తేదీ వరకూ తొలి దశ. 15 నుంచి వచ్చే నెల 16 వరకూ రెండో దశ. ఆగస్టు 17- 31వ తేదీ వరకూ మూడో దశగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆరోగ్య శాఖ ప్రచార బాధ్యతలు, అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారాలు చేపడుతుంది. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు పంపిణీ చేస్తారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ వారు గ్రోత్ మానిటరింగ్, న్యూట్రీషియన్ అసెస్మెంట్, పోషకాహార లోపం గల బాలలను గుర్తించేలా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అంతేకాకుండా వారంలో ఒక రోజు ప్రతి ఆరోగ్య కేంద్రం వద్ద చేతి శుభ్రత, ప్రతి బుధవారం ఎంఎల్‌హెచ్‌పీలు నీటి నాణ్యతను పరిశీలించే కార్యక్రమాలను చేపడతారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్లు, గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల వద్ద నీటి నాణ్యత పరీక్షకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

కంటికి రెప్పలా..

రెండు నెలల లోపు వయసున్న పిల్లల్లో అతిసార నివారణకు ఎటువంటి ద్రావణాలూ ఇవ్వరు. వారు తల్లిపాల మీద ఆధారపడి ఉండడమే దీనికి కారణం . తల్లిపాలు తాగే బిడ్డకు ఏమీ కాదన్నది శాస్త్రీయ నిరూపణ. రెండు నుంచి ఆరు నెలల మధ్య వయసున్న వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు 14 రోజుల పాటు ఇస్తారు. ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఓఆర్ఎస్ పాటు 20 గ్రాముల జింక్ మాత్రలను 14 రోజుల పాటు ఇస్తారు. అతిసార బారిన పడకుండా చంటిపిల్లల్ని కంటికి రెప్పలా కాచుకోవాలి.

ముందస్తు జాగ్రత్తలతో పూర్తి నయం

వర్షాకాలంలో విద్యార్థుల పట్ల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఐదేళ్ల పిల్లల విషయంలో పాఠశాల యాజమాన్యం ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లు నిర్వహించాలి. అదేవిధంగా సురక్షితమైన నీరు తాగడం, ఎప్పటికప్పుడు చేతులు సబ్బుతో కడుక్కోవడం, వ్యక్తిగత శుభ్రత, ఆహార పరిశుభ్రత పాటించాలి. ఏడాదిలోపు చిన్నారులు టీకాలు సకాలంలో వేయించుకోవాలి. ఇంటి సమీపంలో పరిశుభ్రత పాటించాలి. తల్లిదండ్రులు, టీచర్లు చిన్నారుల పట్ల తీసుకునే పరిశుభ్రత కారణంగా అతిసార వ్యాధిని దరి చేరనివ్వం.

– డాక్టర్ లక్ష్మీకాంత్, చిన్నపిల్లల వైద్యనిపుణులు

ఆస్పత్రిలో ప్రత్యేక బెడ్స్

అనకాపల్లి జిల్లాలో డయేరియా కేసులు నమోదు కాలేదు. ముందస్తుగా స్టాప్ డయేరియా పేరిట రెండు నెలల పాటు ప్రత్యేక హెల్త్ క్యాంపులను నిర్వహిస్తున్నాం. ప్రతి గ్రామంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రచారం కల్పిస్తున్నాం. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఆస్పత్రిలో కూడా డయేరియా కేసులు ఏమైనా వచ్చినా వాటికి ప్రత్యేక బెడ్స్ సౌకర్యం కూడా కల్పిస్తున్నాం.

– డాక్టర్ బాలాజీ, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

'వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి'

అనకాపల్లి: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ వ్యవస్థను తొలగించడం అన్యాయమని జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో ఆక్షేపించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచిన వలంటీర్ వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారికి సకాలంలో లబ్ధిని అందించిన వలంటీర్లను ఎన్నికల ముందు కొనసాగిస్తామని చెప్పిన కూటమి, అధికారం చేపట్టిన తరువాత తొలగించడం సరికాదన్నారు. బడుగు, బలహీన వర్గాల నిరుద్యోగులు ఎక్కువగా వలంటీర్ వ్యవస్థపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని, ఈ ఏడాది ఆగస్టు మాసానికి రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ వ్యవస్థను కొనసాగించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి కొడుకుకు గాయాలు


గాయపడి రోడ్డుపై పడివున్న సత్తిబాబు

మాకవరపాలెం: మోటార్ సైకిల్‌ను బొలెరో వాహనం ఢీకొట్టిన సంఘటనలో తండ్రి మృతి చెందగా కొడుకు గాయపడ్డాడు. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన యాకా సత్తిబాబు(45) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తనకున్న ముగ్గురు పిల్లల్లో ఇద్దరు పిల్లలకు పుస్తకాలు కొనేందుకు బుధవారం రాత్రి మాకవరపాలెం వచ్చాడు. తిరిగి స్వగ్రామం వెళుతుండగా తామరం టీచర్స్ కాలనీ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టడంతో సత్తిబాబు తలకు తీవ్ర గాయాలవగా, ఒక కొడుకు రాము స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ఎస్‌ఐ రామకృష్ణారావు 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రికి వెళ్లేసరికి సత్తిబాబు మరణించాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో ఇద్దరు ఐదో తరగతి చదువుతుండగా, పెద్ద కుమారుడు డిప్లమో చదువుతున్నాడు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన సత్తిబాబు మృతితో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వైభవంగా వరదపాయస ఉత్సవం

- సింహగిరి వైకుంఠవాసుడి మెట్టపై విశేష సేవ
- స్వామికి అభిషేకాలు, పాయసం నివేదన
- పొర్లుబండపై నుంచి పాయసాన్ని జారవిడిచిన అర్చకులు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు


వైకుంఠవాసుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు



పొర్లుబండపై నుంచి పాయసాన్ని జారవిడుస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) విశేష అలంకారంలో వైకుంఠవాసుడు

సింహాచలం: వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని వైకుంఠవాసుడిని వేడుకున్నారు భక్తజనులు. సింహగిరిపై వైకుంఠవాసుడి మెట్టపై వరదపాయసం సేవను శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకులు బుధవారం విశేషంగా నిర్వహించారు. వైకుంఠవాసుడి సన్నిధిలో పాయసం వండి, సమీపంలో ఉన్న పొర్లు బండపై నుంచి జారవిడిచారు. ఉదయం 9గంటల నుంచి అర్చకులు పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై కొలువుదీరిన వైకుంఠవాసుడి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ద్వాదశ కలశ స్నపన తిరుమంజనం, విశేష ఆరాధన ఘనంగా నిర్వహించారు. విరాట్‌పర్వాన్ని పారాయణం చేశారు. అనంతరం అక్కడే వండిన పాయసాన్ని స్వామికి నివేదించి, సమీపంలో ఉన్న పొర్లు బండపై ఆ పాయసాన్ని జారవిడిచారు. భక్తులు పొర్లు బండపై నుంచి జారే పాయసాన్ని తీసుకుని ప్రసాదంగా స్వీకరించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు, వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'జీఆర్‌టీ' సహకారంతో వైకుంఠనాథుడి ఆలయ అభివృద్ధి

ఎంతో విశిష్టత కలిగిన వైకుంఠనాథుడి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు దేవస్థానం చర్యలు చేపట్టిందని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దానికి సంబంధించిన ప్రణాళికలు కూడా తయారు చేశామని, అయితే జీఆర్‌టీ జ్యూయలర్స్ యాజమాన్యం అభివృద్ధి పనులకు ముందుకు వచ్చిందని తెలియజేశారు. ఆలయ ప్రాంగణాన్ని భక్తులకు ఆహ్లాదాన్ని కలిగించే విధంగా విజిటింగ్ పాయింట్‌గా తీర్చిదిద్దుతామన్నారు. నిత్యం ధూప దీప నైవేద్యాలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు, లైటింగ్, టాయిలెట్లు, పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేస్తామని చెప్పారు. సెక్యూరిటీ ఉంటుందన్నారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని భావిస్తున్నామన్నారు. అలాగే, వైకుంఠనాథుడి సన్నిధికి సమీపంలోనే జీఆర్‌టీ జ్యూయలర్స్ ఏర్పాటు చేస్తున్న శంఖుచక్రనామాల పనులను గిరిప్రదక్షిణలోపు పూర్తి చేస్తామన్నారు. శ్రీకృష్ణదేవరాయల విజయ స్థూపం ప్రాంగణాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కూడా కల్పిస్తామని వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో భవనం దగ్ధం


భవనంలో చెలరేగుతున్న మంటలు


కాలిపోయిన సీలింగ్


దగ్ధమైన ఏసీ

కోటవురట్ల: షార్ట్ సర్క్యూట్‌తో ఓ భవనంలోని మొదటి అంతస్తు అగ్నికి దగ్ధమయింది. ఫైర్ ఇంజిన్ వచ్చేసరికి అందులోని ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయాయి. వివరాలివి. స్థానిక సినిమా హాలు రోడ్డులోని మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న జానకి హరికి చెందిన భవనంలోని మొదటి అంతస్తులో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. ఆ సమయంలో అంతా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండడంతో ప్రాణాపాయం తప్పింది. మంటలను గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వాహనం వచ్చేసరికి మొత్తం కాలిపోయింది. భవనంలోని సీలింగ్, ఏసీ, ఫ్రిజ్, సోఫాలు, వాషింగ్ మెషిన్, ఫ్యానులు, మంచం, పరుపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. పక్కనే ఉన్న శెట్టి రమణ భవనానికి కూడా మంటలు ఎగబాకి, అక్కడి గదిలోని ఏసీ, ఫ్రిజ్, సోఫాలు, ఇతర ఫర్నిచర్ కాలిపోయాయి. సమీప ఇళ్లల్లోని ఫ్యానులు, ఎలక్ట్రానిక్ పరికరాలు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయినట్లు స్థానికులు చెప్పన్నారు. ప్రమాదంలో జానకి హరికి సుమారు రూ.10 లక్షలు, శెట్టి రమణకు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

'టీచర్ టూల్' శిక్షణతో విద్యా బోధన మెరుగు


శిక్షణ పొందుతున్న అబ్జర్వర్ ఉపాధ్యాయులు


అబ్జర్వర్ టీచర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ డీఆర్ భాగ్యశ్రీ

కశింకోట: విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై ఉన్న వెనుకబాటుతనాన్ని తగ్గించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఉపాధ్యాయులను కోరారు. కశింకోటలోని డీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్జర్వర్ టీచర్లకు నిర్వహిస్తున్న టీచర్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ తీరును గమనించి, ఎంత మేరకు ఆకళింపు చేసుకుంటున్నారనే విషయమై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 9 రోజులపాటు జరిగే శిక్షణ పూర్తయిన తర్వాత ఇక్కడ నేర్చుకున్న అంశాలతో పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించి విద్యాభివృద్ధికి దోహదపడాలని సూచించారు.

బోధనలో బోధనాభ్యసన సామగ్రిని విరివిగా వినియోగించాలన్నారు. రాష్ట్ర పరిశీలకురాలు డీఆర్ భాగ్యశ్రీ కూడా శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏఎంవో ఎంఎం పట్నాయక్, కోర్సు డైరెక్టర్ డీఆర్ పాఠశాల హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు, ఎంఈవో–2 మూర్తి, ఏపీవో వెంకటేశ్వరరావు, మాస్టర్ ట్రైనీలు నారాయణరావు, అచ్యుత కృష్ణ, నూకేష్, ఫణీంద్రకుమార్, వేణుగోపాల్, శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు ఆనంద్, అప్పారావు, రవి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

- 28 మందికి చెరో రూ.10 వేలు చొప్పున విధించిన న్యాయమూర్తి


మద్యం సేవించిన వాహనాలు నడిపిన వారితో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు

అనకాపల్లి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ 28 మందిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు తెలిపారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఆయన వాహనదారులతో మాట్లాడారు. వాహనాలు నడిపేటపుడు మద్యానికి దూరంగా ఉండాలని హితవు పలికారు. పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనదారులు 21 మందిపై కేసులు నమోదు చేసి, రూ.9,335లు జరిమానా విధించినట్లు వెల్లడించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. లేని పక్షంలో భారీ జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు వారితోపాటు, ఇతరులకూ ఇబ్బంది కలిగిస్తారన్నారు. రెండవ సారి నేరం చేస్తే రూ.15 వేలు లేదా 3 ఏళ్ల జైలు శిక్ష, ఒక్కోసారి రెండూ విధించే అవకాశాలు ఉన్నాయన్నారు.

వరుణుడి కరుణపై అన్నదాతల ఆశలు

దేవరాపల్లి: రైవాడ జలాశయ క్యాచ్‌మెంట్ ఏరియా పరిధిలో చిరుజల్లులు మినహా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవట్లేదు. దీంతో ఆయకట్టు అన్నదాతల్లో రోజురోజుకూ ఆందోళన పెరుగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన సాగునీటి సరఫరా ఆయకట్టుకు అందుతుందో.. లేదోనని బెంగ పడుతున్నారు. రైవాడ ఆయకట్టు సాగు రైతులకు జలాశయం నుంచి వచ్చే నీరే ప్రధాన ఆధారం. ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటి నిల్వలతో ఖరీఫ్ సాగు గట్టెక్కడం కష్టమేనని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల్లో కురిసిన వానలతో జలాశయంలో 80 సెం.మీ. మేర మాత్రమే నీటి మట్టం పెరిగింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు. కొత్తగా చేరిన నీటితో ప్రస్తుతం 105.50 మీటర్లకు నీటి మట్టం చేరింది. వారం రోజుల క్రితంతో పోల్చితే కాస్త నీటి మట్టం పెరిగినా, ఆయకట్టు రైతుల్లో ఆందోళన ఉపశమించే స్థాయిలో ప్రస్తుతం జలాశయ నీటి మట్టం లేదు. భారీ వర్షాలు కురిసి జలాశయంలో నీటి నిల్వలు పెరిగితే తప్ప ఖరీఫ్‌కు సాగు నీటి కష్టాలు అధిగమించే పరిస్థితి ఉండదని రైతులు దిగాలు పడుతున్నారు.

పలు రైళ్లు రద్దు.. మరికొన్ని రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పలాస–విజయనగరం మెయిన్ లైన్ పరిధిలో జరుగుతున్న భద్రతా ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

5వ తేదీన రద్దయిన రైళ్లు

పలాస–విశాఖపట్నం (07471) పాసింజర్, విశాఖపట్నం–పలాస(07470) పాసింజర్, విశాఖపట్నం–గుణుపూర్(08522) పాసింజర్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్, విశాఖపట్నం–భవానిపట్న(08504) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–బ్రహ్మాపూర్(08532) పాసింజర్, విశాఖపట్నం–భువనేశ్వర్(22820)ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్.

6వ తేదీన రద్దయిన రైళ్లు

బ్రహ్మపూర్–విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్, భవానిపట్న–విశాఖపట్నం(08503) పాసింజర్, భువనేశ్వర్–విశాఖపట్నం(22819)ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- ముంబయిలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరాల్సిన సిఎస్‌ఎంటి –భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ మూడున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.30 గంటలకు బయల్దేరుతుంది.
- భువనేశ్వర్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12.10 గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్– రామేశ్వర్(20896) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.40 గంటలకు బయల్దేరుతుంది.
- ఎస్‌ఎంవీటి బెంగళూరులో గురువారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన ఎస్‌ఎంవిటీ బెంగళూరు– గౌహతి (125090 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్య రాత్రి 1.40 గంటలకు బయల్దేరుతుంది.
- టాటానగర్‌లో శుక్రవారం ఉదయం 5.15 గంటలకు బయల్దేరాల్సిన టాటానగర్– ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా ఉదయం 6.45గంటలకు బయల్దేరుతుంది.
- సంబల్‌పూర్‌లో శుక్రవారం ఉదయం 10.5 గంటలకు బయల్దేరాల్సిన సంబల్‌పూర్ –నాందేడ్(20809) నాగావళి ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.50 గంటలకు బయల్దేరుతుంది.
- సంత్రగచ్చిలో గురువారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి– తాంబరం (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మూడున్నర గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారు 3.10గంటలకు బయల్దేరుతుంది.
- విశాఖపట్నంలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం– విజయనగరం (07468) మెము రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయల్దేరుతుంది.

ప్రమాదానికి గురై పోలీసులకు చిక్కిన గంజాయి నేరస్తులు

కశింకోట: రోడ్డు ప్రమాదం కారణంగా గంజాయి అక్రమ రవాణాదారులు పోలీసులకు చిక్కారు. 3.5 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ సంఘటన మండలంలోని నరసింగబిల్లి వద్ద బుధవారం జరిగింది. సీఐ ఎం.వినోద్‌బాబు అందించిన వివరాలు. విశాఖ నుంచి రాజమండ్రి వెళుతున్న బైక్, ఎదురుగా వస్తున్న మరో బైక్ నరసింగబిల్లి వద్ద ఢీకొన్నాయి. దీంతో రెండు బైక్‌లపై ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. అనకాపల్లి ఆస్పత్రిలో చేరారు. ఈ మేరకు సమాచారం అందడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించగా బైక్‌పై రాజమండ్రికి గంజాయి తరలిస్తున్న విషయం బయటపడింది. దీంతో దాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తూ ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చేరిన రాజమండ్రికి చెందిన రుద్ర దుర్గా వెంకటరమేష్, ఎస్.యశ్వంత్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచనట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

అప్పల బాధకు వ్యక్తి ఆత్మహత్య

కశింకోట: అప్పుల బాధ తాళలేక ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.వినోద్‌బాబు బుధవారం వెల్లడించారు. వివరాలివి. స్థానిక భవానీకాలనీకి చెందిన శిష్టి పరమేశ్వరరావు(48) వ్యాన్ నడుపుతూ వచ్చిన ఆదాయంతో కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం రూ.10 లక్షలకు పైగా అప్పులు చేశాడు. అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి మొదలయింది. దీన్ని భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతునికి ఇద్దరు పెళ్లైన ఆడ పిల్లలున్నారు.

రైల్వేస్టేషన్‌లను పరిశీలించిన రైల్వే జీఎం

ప్లాట్‌ఫామ్‌ల అభివృద్ధి..
బ్యారెక్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం

అగనంపూడి/తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్‌తో కలిసి విశాఖపట్నం, దువ్వాడ స్టేషన్‌లలో పర్యటించారు. ఇందులో భాగంగా విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో జరుగుతున స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులను పరిశీలించారు. మార్షలింగ్ యార్డ్స్, కోచింగ్ యార్డ్స్ వంటి కీలక విభాగాలలో తనిఖీలు చేశారు. సాయంత్రం మూడున్నర గంటలకు దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక వ్యాగన్‌లో చేరుకున్నారు. ముందుగా వడ్లపూడిలోని రైల్వే వ్యాగన్ రిపేర్ షాప్ (డబ్ల్యుఆర్‌ఎస్)ను సందర్శించారు. తర్వాత అమృత్ భారత్ పథకంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్‌కే సేనాపతి వర్క్‌షాప్ విధి విధానాల గురించి తెలిపారు. అనంతరం జీఎం వెయిటింగ్ హాళ్లు, రైల్వే కార్యాలయాలు, స్టాళ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నేపథ్యంలో నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ ఫ్లోరింగ్ మరమ్మతులకు గురై ఉండటం, మెట్లు కూడా సరిగా లేకపోవడంతో అధికారులపై మండిపడ్డారు. ఎన్టీపీసీ ట్రాక్ క్రాసింగ్ వంతెన మీద నుంచి నిర్మాణంలో ఉన్న భవన సముదాయ పనులు, ఆర్‌పీఎఫ్ బ్యారెక్స్ పనులు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించి విశాఖ పయనమయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి. మొయిత్ర, చీఫ్ ఆపరేషన్ మేనేజర్ వై.ఎన్.బాబు, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌కుమార్, స్టేషన్ మేనేజర్ ముఖీ, ఇన్‌స్పెక్టర్ మాధురి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాము పాల్గొన్నారు.

నాగావళికి హాల్ట్ ఇవ్వాలి..

సంబల్‌పూర్ నుంచి నాందేడ్ వరకు నడుపుతున్న నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని దువ్వాడ రైల్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్‌ను వినతిపత్రంలో కోరారు. విశాఖతో సమాంతరంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్న క్రమంలో నాగావళికి హాల్ట్ ఇవ్వాలని కోరారు. అలాగే దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు కంచుమూర్తి ఈశ్వర్, వి.జాషువా, ఎస్.రామకృష్ణ, కె.వీర్రాజు తదితరులు ఉన్నారు.

డప్పు కళాకారుడు ఆత్మహత్య

మునగపాక : మనస్థాపానికి గురై మునగపాక దళితవాడకు చెందిన వ్యక్తి పురుగు మందు తాగి మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. మునగపాక దళితవాడకు చెందిన డొప్పా రమణ (51)డప్పు కళాకారునిగా పని చేస్తూ ఆటోను నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి రమణ అతని భార్యకు మధ్య చిన్న గొడవ చోటు చేసుకుంది.

దీంతో మనస్థాపానికి గురైన రమణ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు అతనిని అనకాపల్లి వందపడకల ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి రమణను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. రమణకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచిన రమణ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.దీంతో దళితవాడలో విషాదం అలముకుంది.

కోస్టల్ రైడర్స్ బోణీ

ఖాతా తెరవని టైగర్స్


మ్యాచ్ బెస్ట్‌గా నిలిచిన కోస్టల్ రైడర్స్ ఓపెనర్ రషీద్



రామన్ త్రోను అందుకుని హరిశంకర్‌ను రనౌట్ చేస్తున్న లేఖజ్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడవ సీజన్‌లో కోస్టల్ రైడర్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. వైఎస్సార్ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై ఎనిమిది పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడో సీజన్ తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన రైడర్స్ టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. ఓపెనర్ కెప్టెన్ రషీద్47 బంతుల్లో ఐదు ఫోర్లు,మూడు సిక్సర్లతో 67 పరుగులు చేసి గట్టి పునాది వేశాడు. మరో ఓపెనర్ టెండూల్కర్ ఆరు పరుగులకే వెనుదిరగ్గా అతని స్థానంలో వచ్చిన అభిషేక్ 22 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో కెప్టెన్‌కు సహకరించి స్కోర్‌ను పరుగులెత్తించాడు. ధరణి, వర్ధన్‌లు చెరో 14 పరుగులు చేశారు. రామన్ 19 పరుగులతో నిలిచాడు. రషీద్ ఆట చివరి బంతి వరకు ఆడి ఆరో వికెట్‌కు 40 పరుగులు జోడించి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. టైగర్స్ బౌలర్ సాయితేజ రెండు వికెట్లు తీయగా హరిశంకర్, అఖిల్, లలిత్ చెరో వికెట్ పడగొట్టారు.

చివర్లో తడబాటు

ధాటిగానే లక్ష్య ఛేదనకు దిగిన బెజవాడ టైగర్స్ చివర్లో తలబడ్డారు. నాలుగు వికెట్లకు 128 పరుగుల వద్ద కెప్టెన్ రికీబుయ్ (34) వెనుతిరగడంతో మరో 11 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ ధ్రువ్ 29 బంతుల్లోనే నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 45 పరుగులు చేసి గట్టి పునాది వేశాడు. మరో ఓపెనర్ మహీప్(9), అతని స్థానంలో వచ్చిన లక్ష్మణ్(10) స్కోర్‌ను పెంచే క్రమంలో పెవిలియన్‌కు చేరాడు. కెప్టెన్ రికీతో కలిసి అవినాష్(42) నిలకడగా ఆడుతూ స్కోర్‌ను పెంచారు. దుర్గాకుమార్, హరిశంకర్ రనౌటై వెనుదిరిగారు. చివరికి తొమ్మిది వికెట్లకు 162 పరుగులతో టైగర్స్ ఇన్నింగ్స్ ముగిసింది. స్టీఫెన్, ప్రమోద్, రమన్ రెండేసి వికెట్లు తీసి జట్టుకు విజయాన్నందించారు. ఈ మ్యాచ్‌లో గేమ్ చేంజర్‌గా స్టీఫెన్, సూపర్ స్ట్రయికర్‌గా అభిషేక్, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రషీద్ నిలిచారు.

రాయలసీమ కింగ్స్ బాదేశారు

ఏపీఎల్ మూడో సీజన్‌లో భాగంగా బుధవారం ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ గోదావరి టైటాన్స్‌పై విజయం సాధించింది. మరో పది బంతులుండగానే కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. టాస్ ఓడిన గోదావరి టైటాన్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. కెప్టెన్ జ్ఞానేశ్వర్ ఓపెనర్‌గా 20 పరుగులు చేయగా మరో ఓపెనర్ విమల్‌కృష్ణ 35 బంతుల్లో మూడు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 57 పరుగులు చేశాడు. ప్రసాద్21, శశికాంత్ 36 పరుగులతో రాణించారు. దీంతో ఏడు వికెట్లకు 175 పరుగులకు టైటాన్స్ ఇన్నింగ్స్ ముగిసింది. గిరినాథ్, సత్యనారాయణ చెరో రెండు వికెట్లు తీశారు. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన రాయలసీమ కింగ్స్ తొలి బంతినే బౌండరీకి తరలించిన హనీష్ మూడో బంతికి శశికాంత్ బౌలింగ్‌లో జ్ఞానేశ్వర్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో వెనుదిరిగాడు. నాలుగు పరుగులకే తొలి వికెట్ కోల్పోయినా మరో ఓపెనర్ ప్రశాంత్ 41 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 49 పరుగులు చేశాడు. రోషన్ అజేయంగా 70 పరుగులు చేయగా గిరినాథ్ నాలుగు బంతుల్లోనే ఏడు పరుగులతో నిలిచాడు. రోహిత్ 39 పరుగులు చేశాడు. రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించగా మూడో వికెట్‌కు 71 పరుగులు నమోదు చేసి.. కింగ్స్ విజయకేతనం ఎగురవేశారు. రోషన్ మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు.

క్లుప్తంగా

నేడు లక్ష్మీనృసింహుడికి స్వర్ణ సంపెంగలతో అర్చన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దిబ్బవీధి వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం తెల్లవారు జామున స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన జరపనున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు ఆరవెల్లి సత్యప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాల్సిందిగా కోరారు.

రోగులతో దురుసుగా ప్రవర్తించడం తగదు

అనకాపల్లి: వర్షాకాలంలో సీజనల్ రోగాలతో వైద్యం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చే రోగుల పట్ల ఎన్టీఆర్ ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. కొత్తగా ఆస్పత్రికి వచ్చిన 15 మంది పీజీలతో పాటు రెగ్యులర్ వైద్యులు కూడా ఇదే తీరున ప్రవర్తించడంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎవరైనా కాస్త ఎదురుతిరిగి మాట్లాడితే విశాకలోని కేజీహెచ్‌కు రిఫర్ చేస్తామని చెప్పడంతో రోగులు, వారి బంధువులు భయపడుతున్నారని ఆక్షేపించారు. కలెక్టర్, వైద్య శాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి, మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని కోరారు.

దివ్యాంగుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

తుమ్మపాల: దివ్యాంగులకు అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేసి వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు దివ్యాంగులు బుధవారం వినతిపత్రం అందించారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో పట్టణ, మండల పరిధిలోని దివ్యాంగులు ఆయన్ని కలిసి, తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఉపాధి హామీ పథకంలో దివ్యాంగులకు ప్రత్యేక ఉపాధి కల్పించాలని, సబ్సిడీ రుణాల మంజూరు, దివ్యాంగుల జిల్లా కార్యాలయం పట్టణంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దివ్యాంగ సంఘం నాయకులు వెలగ బుజ్జి, రాపేటి భాస్కరరావు, బూడిగ నూకఅప్పారావు, బుద్ధ ధనలక్ష్మి, ఆదారి అన్నపూర్ణ, షేక్ రెహమాన్ తదితరులు ఉన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 42 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	4,400	4,400
మూడోరకం	3,510	3,810

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్తిసాయి
హరోంహర	:వెంకటేశ్వర
రాజధాని రౌడీ	:శ్రీసత్య
కల్కి2898 ఏడీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 82 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-38 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వ్యాధుల కాలం.. ఆరోగ్యాలు జర భద్రం

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. సీజనల్ రోగాలు ప్రబలుతాయి. ఆస్పత్రులు కిక్కిరిసిపోతాయి. ఇంట్లోనే చికిత్స తీసుకునే రోగుల గురించి చెప్పనక్కర్లేదు. ఈ సీజన్లో చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే రోగాల బారి నుంచి తప్పించుకోవచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే అనకాపల్లి పట్టణం, మండల ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచేందుకు వైద్యాధికారులు ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని సూచిస్తున్నారు.



నెయ్యిలవీధి కాలువలో దోమల మందు పిచికారీ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు



కోట్నివీధిలో నిల్వనీటిని పారబోస్తున్న పారిశుధ్య కార్మికులు



లక్ష్మీదేవిపేటలో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ ఉద్యోగి



నిదానందొడ్డి వీధిలో టైర్లలో నీటిని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు

- చిన్నపాటి జాగ్రత్తలతో సీజనల్ రోగాలకు దూరం
- అవగాహన కార్యక్రమాల్లో వైద్యాధికారులు బిజీ
- వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతే మేలు

అనకాపల్లి: వర్షాకాలం వచ్చేసింది. వారం రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో జ్వరాలతో ప్రజలు మంచానపడుతున్నారు. ఆస్పత్రుల్లో రోగుల రద్దీ పెరుగుతోంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయింది. జీవీఎంసీ సిబ్బంది కాలువల్లో పూడికలు, నిల్వ నీరు లేకుండా పలు చర్యలు చేపడుతున్నారు. ప్రజల్లో కూడా వ్యాధుల పట్ల అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నారు.

అప్రమత్తతే శరణ్యం

ఈ కాలంలో కురిసే వర్షాలకు ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుంది. తాగునీరు కలుషితమవుతుంది. చెత్తాచెదారాలు ఓ చోటే పేరుకుపోతాయి. దీంతో దోమల వ్యాప్తి పెరిగి, రోగాలు ప్రబలుతాయి. ప్రధానంగా డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ఎక్కువగా సంక్రమిస్తాయి. తాజాగా ఆస్పత్రులకు పెరుగుతున్న రోగుల తాకిడి దీన్ని స్పష్టం చేస్తోంది. దీంతో ప్రజలు గృహాల్లో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు చెప్తున్నారు. తరచూ చేతులు కడుక్కోవడం, వేడి వేడిగా ఆహార పదార్థాలను తీసుకోవడం, కాచి వడబోసిన నీటినే తాగడంతోపాటు ఇంటి పరిసరాలు, సమీప రహదారుల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఉన్న చోట అప్రమత్తంగా ఉండాలని చెప్తున్నారు.

నీరు నిలిస్తే.. దోమల వ్యాప్తి

గృహాల్లో పువ్వుల కుండీలు, వాటర్ ట్యాంక్‌లు, ఖాళీ కొబ్బరి బొండాలు, చిన్నచిన్న ప్లాస్టిక్ డబ్బాలు, ఇతర వస్తువుల్లో నీరు రోజుల తరబడి నిలిచి, దోమల వ్యాప్తికి కారణమవుతాయి. గృహాల్లో, పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తపడాలి.

డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి ఆటంకాల్లేకుండా చూసుకోవాలి. వారానికి కనీసం ఓసారి ఇంట్లోని పాత్రలన్నీ ఖాళీ చేసి, ఆరబెట్టాలి. దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలు, బాల్కనీలు, ద్వారాలకు మెష్‌లు పెట్టించాలి. పడుకునేటపుడు దోమతెరలు, దోమల్ని నియంత్రించే ఏర్పాట్లు చేసుకుంటే చాలా వరకు రోగాలను తప్పించుకోవచ్చని వైద్యుల సూచన. పట్టణ పరిధిలో జీవీఎంసీ, గ్రామాల్లో పంచాయతీ అధికారులు దోమల నియంత్రణకు ఫాగింగ్, బ్లీచింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.

ముందస్తు చర్యల్లో జీవీఎంసీ



జీవీఎంసీ విలీనగ్రామం కొత్తూరులోని కాలువల్లో పూడిక తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

అనకాపల్లి జోన్ పరిధిలో 80 నుంచి 84 వార్డుల్లో రాత్రి సమయంలో దోమలు సంచరించకుండా ప్రజారోగ్య విభాగం అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఒక్కో వార్డు పరిధిలో వారికి ఒకసారి ఫాగింగ్ చేస్తున్నారు. డ్రైనేజీల్లో నీరు నిలిచి ఉండే ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. గత ఏడాది పట్టణ పరిధి గవరపాలెం నిదానందొడ్డిలో రెండు మలేరియా కేసులు వచ్చాయి. ప్రధానంగా శ్రీరామ్‌నగర్, అరుంధతీ నగర్, అంజయ్యకాలనీ, గొల్లవీధి, చాకలిపేట, భీమునిగుమ్మం వంటి ప్రాంతాల్లోని కాల్వల్లో ఎప్పుడూ నీరు నిలిచే ఉంటుంది. ఇలాంటి ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఈ సీజన్‌లో జాగ్రత్తలు తప్పనిసరి



వాతావరణంలో మార్పులు, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు వచ్చే అవకాశాలెక్కువ. చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే ఈ సీజన్లో వచ్చే రోగాల బెడద నుంచి తప్పించుకోవచ్చు. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకపోతే దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించి, రక్తపరీక్షలు చేయించుకోవాలి. వేడివేడి ఆహారం తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. సాధ్యమైనంత వరకూ నీటిని కాచి వడబోసి తాగాలి. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ కనకదుర్గ, ఎన్టీఆర్ వైద్యాలయం

ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్య సంరక్షణ

తుమ్మపాల: డెంగ్యూ, డయేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వాణిజగదీశ్వరి, సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని మార్టూరు, తుమ్మపాల గ్రామాల్లో వేర్వేరుగా నిర్వహించిన డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం, కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కుళాయిలు, బోర్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మురుగు నీటిలో కిరోసిన్, వాడేసిన ఇంజిన్ ఆయిల్ చల్లడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. జ్వర లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించి తగు పరీక్షలు చేయించుకుని, మందులు వాడాలన్నారు. విషజ్వరాలు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది, వైద్య సిబ్బంది ద్వారా నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.సంగం, ఆర్‌వీ నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు ఎస్.ఈశ్వరరావు, బి.మంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ నవ్య, ఏఎస్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం



కశింకోట పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కశింకోట: కశింకోటలో బుధవారం చాలా సేపు వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షం వల్ల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లే రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. చెరకు తోటలకు, ఖరీఫ్ వరి సాగుకు దుక్కి చేసుకోవడానికి ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గెడ్డవాగులో ఆక్రమణల తొలగింపు



ఇరువాడ గెడ్డవాగులో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని ఇరువాడ రెవెన్యూ పరిధి గెడ్డవాగులో ఆక్రమణలను స్థానిక రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. గతంలో జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 106, 103లలో సిబ్బంది మరోసారి సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో పలు ఆక్రమణలు జరిగినట్టు గుర్తించారు. సర్వే నెంబర్లు 106, 103లలో కోట్లాది రూపాయల విలువచేసే సుమారు 3 ఎకరాల గెడ్డవాగు /పోరంబోకు స్థలాన్ని ఒక రియల్టర్ ఆక్రమించి లే అవుట్ వేసి క్రయ విక్రయాలు కూడా చేపడుతున్నాడని అదే గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు అనే వ్యక్తి గత నెల 24న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్పందన కార్యక్రమంలో అప్పటి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఆర్ఐ వీరయ్య, సర్వేయర్ శ్రీనివాసరావు మిగిలిన సిబ్బందితో కలిసి గెడ్డవాగును పరిశీలించి సర్వే నిర్వహించారు. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి నుంచి ప్రైవేటు లే అవుట్‌కు వెళ్లేందుకు 23 సెంట్లు సర్వే నెంబర్ 106లో ఉందని గుర్తించినట్లు సర్వేయర్ శ్రీనివాసరావు తెలిపారు. ఎంత వరకూ ఆక్రమణకు గురైందని సర్వే పూర్తి చేసి గురువారం వెల్లడిస్తామని చెప్పారు. గెడ్డవాగులో గుర్తించిన మేరకు ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

125 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సత్యవతి

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర మెడికల్స్ సౌజన్యంతో బుధవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సుమారు 125 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు.వీరిలో 32 మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు.వీరికి శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని కోఆర్డినేటర్ సతీష్ తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ మేనేజర్ ఎం. అరుణకుమారి,పాణీ, పణీంద్ర,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనతో పర్యావరణ పరిరక్షణ



పర్యావరణ పరిరక్షణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ గిరీష్‌కుమార్ సూచించారు. స్థానిక ఉడ్‌పేట స్కూల్‌లో చిన్నారులతో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ప్లకార్డులతో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తుందన్నారు. భూగర్భ జలాలు కలుషితమవడంతోపాటు, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడే అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ ఉపకరణాలను వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ చిన్నారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు వి.కనకప్పారావు సూచించారు. డయేరియా నివారణపై గొర్లివానిపాలెం జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి కనకప్పారావు మాట్లాడుతూ అతిసార వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పరిసర ప్రాంతాల అపరిశుభ్రత, కలుషిత ఆహారం, కలుషిత నీటి వల్ల వ్యాధి ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహార పదార్థాలు వేడిగా ఉన్నప్పుడు తీసుకోవాలని సూచించారు. అనారోగ్య సమస్య తలెత్తితే అశ్రద్ధ చేయకుండా వైద్య సేవలు పొందాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు డయేరియా వ్యాధి నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ఇళ్ల వద్ద నిల్వ చేసిన నీటిని తొలగించారు. కార్యక్రమంలో ఎం.పి.హెచ్.ఎస్. వి.సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఏ వై.సత్యనారాయణ, ఏఎన్ఎంలు భారతి, గోపికాసాయి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

7న వాడచీపురుపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో దివంగత మాసవరపు సన్నిబాబు జ్ఞాపకార్థం ఈ నెల 7న ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రామ ఉప సర్పంచ్ కూండ్రపు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ రోజు ఉదయం 8 గంటల కు వైద్య శిబిరం ప్రారంభం అవుతుందని చెప్పారు. శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు ఉచితంగా అందజేస్తారు. బ్లడ్ బ్యాంకు వారు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తారు.

శిబిరానికి వచ్చే రోగులు ఆరోగ్య శ్రీ, ఆధార్ కార్డులతో పాటు పాత మెడికల్ రిపోర్టులు వెంట తీసుకురావాలని సూచించారు. వైద్య శిబిరాన్ని వాడచీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప సర్పంచ్ సత్యనారాయణ కోరారు.

ధార్మిక సమితులు బలపడాలి



కొండకర్ల రామాలయంలో సమావేశమైన సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం: గ్రామాల్లో ధార్మిక సమితులు బలంగా ఉండాలని సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి.రమణ అన్నారు. మండలంలోని కొండకర్ల రామాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామూహిక హారతి, నగర సంకీర్తన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రజల్లో ఆధ్యాత్మికత పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రజల్లో భక్తిభావం పెరిగితే శాంతిసౌభాగ్యాలు విలసిల్లుతాయన్నారు. ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాల్లో గ్రామ యువతను ఎక్కువగా భాగస్వామ్యం చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, చోడపల్లి సత్యం, కట్టమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరాహనదికి జలకళ



వరాహనదిలోకి చేరుతున్న వరదనీరు

కోటవురట్ల: చాలా కాలానికి వరాహనదికి జలకళ వచ్చింది. వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నదిలోకి క్రమేపీ వరద నీరు చేరుతోంది. మొన్నటి వరకు ఎండిపోయి ఎడారిని తలపించిన వరాహనదికి ప్రస్తుతం జలకళ చేరింది. రోజు రోజుకు వరదనీటి మట్టం పెరిగే అవకాశం కనిపిస్తోంది. పాతరోడ్డు వద్ద వరాహా నదిలో సర్పానది సంగమంతో మరింత ఉధృతి కనిపిస్తోంది. చాలా కాలానికి నదిలోకి నీటి ప్రవాహం రావడంతో పరీవాహక రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అడుగంటిన భూగర్భ జలాలు పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

శిథిలావస్థలో తుపాను షెల్టరు



శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టరు పక్కనే వున్న పాఠశాలలో విద్యార్థులు

పాయకరావుపేట : మండలంలో కుమారపురం గ్రామ శివారు గ్రామమైన పెద్దూరు రత్నయ్యమ్మపేట గ్రామంలో తుపాను షెల్టరు భవనం శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా పడి వుంది. కొన్ని సంవత్సరాలుగా ఈ తుపాను షెల్టరు భవనం నిరుపయోగంగా పడి ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. కాగా తుపాను షెల్టరును ఆనుకుని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వుంది. ఈ పాఠశాల్లో 60 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఒకటో తరగతి నుండి 5 వ తరగతి వరకు ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఈ పాఠశాల మాత్రం శిథిలావస్థకు చేరుకున్న తుపాను షెల్టరు కింద ఉండడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు భయభ్రాంతులవుతున్నారు. ఎంతో కాలంగా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో దినదినగండంగా ఉపాధ్యాయులు ఉన్నారు. నిత్యం విద్యార్థులు పాఠశాల ఆవరణలోను, ఈ తుపాను షెల్టరు కిందే సంచరించడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అన్న భయంతో దిగులు చెందుతున్నారు. విద్యార్థులకు విరామ సమయంలోను, పాఠశాలకు వెళ్లేటప్పుడు కూడా ఈ భవనం కింద నుండే వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న తుపాను షెల్టరును తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నేడు ఉమ్మలాడలో దుర్గాలమ్మతల్లి పండగ



ఉమ్మలాడలోని దుర్గాలమ్మ తల్లి

మునగపాక : ఉమ్మలాడలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మూడేళ్లకోసారి నిర్వహించే ఉత్సవాన్ని గ్రామస్తుల సహకారంతో ఈ ఏడాది కూడా ఘనంగా జరుపుతామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆ రోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి దుర్గాలమ్మ తల్లిని దర్శించుకొని తీర్థ ప్రసాదా లు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

పి.ఆనందపురం పాలసంఘం అధ్యక్షుడిగా ఉస్తేల్‌నాయుడు



ఆనందపురం పాలసంఘం అధ్యక్షునిగా బాధ్యతలు చేపడుతున్న ఉస్తేల్‌నాయుడు

మునగపాక : పల్లపు ఆనంద పురం పాలసంఘ అధ్యక్షునిగా కర్రి ఉస్తేల్‌నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖ డెయిరీ మేనేజర్ రమణ, సూపర్‌వైజర్ ఆది అప్పారావు పర్యవేక్షణలో బుదవారం పాల సంఘ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్తేల్‌నాయుడు ను రైతులు అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా ముత్యాల మంగతల్లి, గొంతిన అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఉస్తేల్‌నాయుడు మాట్లాడుతూ రైతులకు విశాఖ డెయిరీ ద్వారా మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు.